క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్‌ల పరిశీలన



విద్యా కానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రానికి వచ్చిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. మండలంలో ఈ కానుకలు ముందుగానే చేరాయి. వాటిని వివిధ ప్రాంతాల్లో స్టాక్‌పాయింట్లుగా ఏర్పాటుచేశారు. వాటిని ఎంపీడీఓ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో ఆయా కిట్లను పంపిణీ చేస్తామన్నారు.

క్రికెట్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

కొయ్యూరు: డౌనూరు సమీపంలో వెలసిన బోడకొండమ్మ తల్లి జాతర సందర్భంగా ఈనెల 20 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నటు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. సాల్మన్‌రాజ్ స్మారకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు టీమ్‌లు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్టు తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదును నర్సీపట్నానికి చెందిన అమ్మ ఆస్పత్రి సర్జన్ జి.వి.రాజు సమకూర్చారని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9492912586 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.


గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కోసంగి, పనసపుట్టు, కుసుమగుడ గ్రామాల్లో గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం ఏర్పాటు చేసినట్టు ఏఈ రాంబాబు చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ట్రాన్స్‌ఫార్మర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఖోఖో పోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణలో భాగంగా గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు త్వరలో బహుతులు అందజేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి



మత్స్యరాజును సత్కరిస్తున్న ఎంపీపీ కుమారి, ఏవో మధుసూదనరావు తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలో గిరిరైతుల వ్యవసాయాభివృద్ధికి తమ వంతు ప్రయత్నం చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మచ్చల మత్స్యరాజు అన్నారు. ప్రభుత్వం ఆయనను వ్యవసాయ సలహామండలి చైర్మన్‌గా నియమించింది. దీంతో శనివారం మత్స్యరాజును ఎంపీపీ బోయినకుమారి, వ్యవసాయాధికారి మధుసూదనరావు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందన సభ ఏర్పాటు చేశారు.

జోరుగా వేసవి దుక్కులు

- కలుపు, చీడపీడల నివారణకు దోహదం
- భూసారం మెరుగు
- వ్యవసాయాధికారుల సూచనలు



దుక్కి పనుల్లో గిరిజన రైతులు

అనంతగిరి: మన్యంలో ప్రస్తుతం వేసవి దుక్కులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సంవృద్ధిగా నీరుండడంతో వ్యవసాయం పనులకు గిరిజన రైతులు శ్రీకారం చుట్టారు. సాగునీటి కాలువలు, గెడ్డలు, వాగులు పరివాహక ప్రాంతాల్లో పనులు జోరందుకున్నాయి. భూపొరల్లో ఉన్న చీడపీడల నివారణకు ప్రస్తుత సీజన్‌లో దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వేసవిలో దుక్కులు చేయడంతో భూసారం మరింత మెరుగవుతోందని చెబుతున్నారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో వేసవి దుక్కులు మొదలుపెట్టారు. వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం పంటపొలాలు ఖాళీగా ఉండడంతో రైతులు వేసవి దుక్కులు చేపడితే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూమి సారవంతం కావడంతో పాటు సూక్ష్మజీవులు, వానపాములు సంతతి పెరుగుతుంది. కలుపు, చీడపీడలు నివారించేందుకు దోహదపడుతుంది. పంటల సాగు పూర్తయిన తరువాత అలాగే వదిలేస్తే భూమిలో సారం దెబ్బతిని తరువాత వేసే పంటలపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

కలుపు మొక్కల నివారణ

పంటలు సాగుచేయకుండా పొలాన్ని అలా వదిలేస్తే కలుపుమొక్కలు పెరిగిపోయి భూసారం తగ్గుతుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల కలుపు మొక్కలను, పంట తెగుళ్లకు కారణమయ్యే శిలీంధ్రాలను నివారించవచ్చు. దుక్కులు చేయడం వలన రైతులకు మేలు జరుగుతుంది.

వర్షాకాలానికి ముందు దుక్కులు

వర్షాకాలం రాకముందే భూమిని మూడుసార్లు దుక్కిచేయాలి. ఇలా చేయడంతో తొలకరి వర్షాలకు నేలమెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు, లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నడం వలన వర్షపునీరు ఇంకి, తేమను నిల్వచేసే అవకాశం ఉంటుంది. దుక్కిచేసి భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపుమొక్కలను నివారించవచ్చు. పశువులు పేడ, కంపోస్టు ఎరువులు వేసుకుంటే భూమి మరింత సారవంతం అవుతుంది. భూముల్లో దుక్కులు చేయకుండా అలాగే వదిలేస్తే పొరలు గట్టిపడిపోతాయి. పంటలు వేసిన సమయంలోని పోషకాలు సరిగ్గా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. భూమి లోతుగా దుక్కి చేయడం ద్వారా నీటినిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు తేమలో జీవించే సూక్ష్మ జీవులు, వానపాములు వృద్ధిచెందుతాయి.

నేల సారవంతం



భూమిని 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతుగా దుక్కులు చేయడం వల్ల నేలలో గాలి లభ్యతపెరిగి సూక్ష్మజీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థాల లభ్యత పెరిగి నేలసారవంతం అవుతుంది. భూమికి వాలుగా దుక్కులు చేయడంతో వర్షం కురిసినప్పుడు నీరు భూమిలోలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వచేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

– ఉమామహేశ్వరి, ఏవో అనంతగిరి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, పార్టీ శ్రేణులు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని బస్కి పంచాయతీ బస్కి, గిర్లిగూడ, భంసుగుడ గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్గుణ ఆయా గ్రామాల్లో 320 గడపలను సందర్శించారు.ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మన్య ప్రాంతాభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు, వివిధ పార్టీల నాయకులు ఎన్ని కుట్ర రాజకీయాలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎటువంటి నష్టం లేదని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ ఉషారాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజా రమేష్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ రమేష్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ సర్పంచ్ రాంచందర్, నాయకులు రఘునాథ్, నగేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతలో 19,133 పాఠ్యపుస్తకాలు



ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలకు అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని పాఠశాలలకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాల సరఫరా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మండలంలోని ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రానున్న విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాల మొదటి విడతగా 19,133 వచ్చాయని ఎంఈవో తాతబ్బాయిదొర శనివారం తెలిపారు. మండల పరిధిలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 5,574 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరికి 47,599 పాఠ్యపుస్తకాలు అవసరముందన్నారు. పాఠశాలల్లో రాగి జావ పంపిణీకి ప్రభుత్వం 3,673 స్టీల్‌గ్లాసులు పంపిణీ చేసినట్టు చెప్పారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ముహూర్తపు రాట




ముహూర్తపు రాట ఏర్పాటులో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నాయకులు


పెదబయలు: మన్య ప్రజల ఇలవేల్పు, ఆరాధ్య దైవం పెదబయలు మోదకొండమ్మ ఉత్సవాల ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సహకారం అందించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు అన్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని గాం, దీబొమ్మ ప్రాంతంలో శతకంపట్టు వద్ద ముహూర్తపు రాట వేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మోదకొండమ్మ ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరుగుతున్న విషయం విదితమే. ఉత్సవాలకు 15 రోజులు ముందుగా శతకంపట్టులో రాట ఏర్పాటు శతకంపట్టు నిర్మాణం శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మోదకొండమ్మ ఉత్సవాల్లో శతకంపట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎంతో భక్తి శ్రద్ధలతో రాట ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా డప్పు వాయిద్యాలు, బాణాసంచా నడుమ శతకంపట్టుకు రాట ఏర్పాటు జరిగింది. దీంతో మోదకొండమ్మ ఉత్సవాలు పనులు ప్రారంభం కానున్నాయి. మాజీ జెడ్పీటీసీ జర్సింగి గంగాభవాని, ఉత్సవ కమిటీ నాయకులు గంపరాయి సూరయ్య, మర్రిచెట్టు అప్పారావు, రూడ చిన్నయ్య, దాస్‌పడాల్, తలారి చక్రదర్, బొండా సన్నిబాబు, జగత్‌రాయ్, పాంగి పాల్గుణ, గంగాధరం, వర్తక సంఘాల నాయకులు లొట్టి చిన్ని, ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండ ఏకలవ్య పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

- సీబీఎస్‌ఈ ఫలితాల్లో టాపర్లకు అభినందనలు



కోరుప్రోలు గ్రీష్మ(444)



ఎం.శివవెంకట సత్యదేవి(443)



కొండ్ల స్వర్ణలత(437)



బి.వెంకట సౌభాగ్యలక్ష్మి(428)

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామలోని ఏకలవ్య మోడల్ బాలికల రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థినులు ఈ ఏడాది 10వ తరగతి ఇంగ్లిషు మీడియం సెంట్రల్ సిలబస్(సీబీఎస్‌ఈ) పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలోని 86 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా, మొత్తం 86 మంది ఉత్తీర్ణులైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ శనివారం తెలియజేశారు. వారిలో నలుగురు విద్యార్థినులు మొత్తం 600 మార్కులకు గాను మామిడి శివ వెంకట సత్యదేవి-443, కోరుప్రోలు గ్రీష్మ-444, కొండ్ల స్వర్ణలత-437, బొగ్గుల వెంకట సౌభాగ్యలక్ష్మి-428 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు తదితరులకు విద్యార్థినులకు అభినందించారు.

సొవ్వలో సువార్త సభలు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కేంద్రంలో ఈనెల 15, 16 తేదీల్లో రక్షణ సువార్త సభలు నిర్వహించనున్నట్టు పాస్టర్ రెంగి మార్క్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సువార్త సభ సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమవుతుందని, క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మదర్స్ డే



మదర్స్ వేడుకలో పాల్గొన్న కృష్ణకుమారి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి ఆధ్వర్యంలో శనివారం మదర్స్ డే వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమానికి హాజరైన మాతృమూర్తులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి

చింతపల్లిరూరల్: పాడేరు ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏ పాలకవర్గ సమావేశం జరిగి సుమారు ఎనిమిది నెలలు అవుతుందన్నారు. ఐటీడీఏ పరిధిలో అనేక అంశాలపై ప్రభుత్వ పరంగా చర్చించి తీసుకోవాల్సిన విధాన పరమైన నిర్ణయాలు అనేకం ఉన్నాయన్నారు. వీటన్నింటిపై ప్రజాప్రతినిధులతో కలిపి పాలకవర్గ సమావేశం జరిపితే కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

పారిశుధ్యంపై అవగాహన



కాలువల్లో చెత్తను తొలగిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్

గూడెంకొత్తవీధి: పెదవలస గ్రామంలోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను శనివారం మండల వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్ తొలగించారు. క్లాప్ మిత్రలతో కలిసి ఆయన గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కాలువల్లో చెత్తను తొలగించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఉంచాలని పాలిథిన్, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని కోరారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన



భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయకులు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివేకానంద కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేంకటేశ్వర స్వామి భక్తిగీతాల ఆలాపన భక్తులను ఆకట్టుకుంది. ఏడుకొండలవాడిపై గాయనీ గాయకులు పలు భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కాంద్రేగుల విష్ణుమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

14 నుంచి మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: బట్లపూడి గ్రామంలో సోహన్ ఆశ్రమంలో లోక కల్యాణార్థం ఈనెల 14 నుంచి 90 రోజుల పాటు మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు రవి శనివారం తెలిపారు. రోజూ 12 గంటల పాటు జరిగే ఈ హోమంలో పాల్గొనే భక్తులు పిడకలు, రోజుకు రెండు కిలోల ఆవు నెయ్యి తీసుకుని రావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9966908908 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం



ఉపాధి వేతనదారులకు సూచనలిస్తున్న సర్పంచ్ చంద్రుడు



గాదిగుంట గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సూరిబాబు

రాజవొమ్మంగి: మండలంలోని గడుఓకుర్తి పంచాయతీ దోనెలపాలెంలో వెయ్యి మీటర్ల రహదారి, చీడిపాలెం గ్రామంలో మరో రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ నవిరెల చంద్రుడు పనులు పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి పీవో, ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ దోనెలపాలెం గ్రామంలో సీతారత్నం పొలం నుంచి మైలబోయిన అమ్మాజీ చేనుమఖాం వరకు 1000 మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.5.81 లక్షల ఉపాధి నిధులు మంజూరైనట్టు తెలిపారు. జాబ్‌కార్డుదారులకు 2223 దినాలు పనులు కల్పించినట్టు చెప్పారు. చీడిపాలెం నుంచి ఆ గ్రామానికి చెందిన శ్మశానవాటిక వరకు మరో రోడ్ మంజూరైందని తెలిపారు. ఈ పని వల్ల 2,222 పనిదినాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు ఏపీఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద భూమి అభివృద్ధి పనులను సర్పంచ్ టి.సూరిబాబు శనివారం ప్రారంభించారు. గ్రామంలో భూమి అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం కింద రూ.2,50,000 మంజూరైనట్టు ఆయన తెలిపారు. దీంతో అనేక మందికి ఉపాధి కూలీ దొరుకుతుందన్నారు. వైస్ సర్పంచ్ వరలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ మత్స్యకొండబాబు, గ్రామపెద్దలు వెంకటరావు, అచ్చిబాబు, మేట్‌లు తదితరులున్నారు.

హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు



పవనగిరిలో కొలువైన సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారు



అసరాడలో సమావేశమైన గిరిజన అర్చక సంక్షేమ సంఘం సభ్యులు

అడ్డతీగల: హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట రామయ్య తెలిపారు. అభయాంజనేయ స్వామి వారి భారీ విగ్రహానికి రంగులు వేయించి పూజాధికాలకు సిద్ధం చేయించామన్నారు.అలాగే సువర్చాల సమేత ఆంజనేయస్వామి వారి ఆలయంలోనూ విశేష పూజాధికాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు.

గూడెంకొత్తవీధి: హనుమజ్జయంతి వేడుకలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు మండల అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ చెప్పారు. మండలంలోని అసరాడలో విశ్వశాంతి జ్యోతిర్మయి ధ్యాన మందిరంలో గిరిజన అర్చకులతో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గిరిజన అర్చకులందరికీ సుమారు 70 మందికి గుర్తింపు కార్డులను జారీచే శామన్నారు.అనంతరం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల ధర్మ ప్రచారకులు చిన్నబ్బాయి, సంఘం మండల సహాయ కార్యదర్శి సలిమితి శాంతి, ధర్మకర్తలు రామారావు, సాయిబాబా ఆలయ ధర్మకర్త లక్ష్మణరావు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ కూడలిలో హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యుడు పాంగి నరేంద్రకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతామన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆదివాసీ సదస్సుపై విస్తృత ప్రచారం



మారేడుమిల్లి సంతలో ప్రచారం నిర్వహిస్తున్న గిరిజనులు

మారేడుమిల్లి: విశాఖలో 21న జరుగు అఖిలభారత ఆదివాసి సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మారేడుమిల్లిలో ఏఐకేఎంఎస్ ఆధర్యంలో మారేడుమిల్లిలో శనివారం సంతలో సంఘ సభ్యులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ , జిల్లా హాయ కార్యదర్శి పండేల సోమన్న మాట్లాడుతూ విశాఖపట్నంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21న నిర్వహించనున్న అఖిల భారత స్థాయి ఆదివాసీ సదస్సులో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సర్పంచ్ జాకబ్

మారేడుమిల్లి: రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో మారేడుమిల్లి జెడ్పీ హైస్కూల్ వద్ద శనివారం నిర్వహించారు. శిబిరంలో సుమారు 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన సర్పంచ్ కొండా జాకబ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని హితవులపలికారు. ఈ రక్తదాన శిబిరంలో మారేడుమిల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండా జాకబ్, ఉప సర్పంచ్ వీరబాబు, కో–ఆప్షన్ గురుకు ధర్మరాజు, తెదేపా మండలాధ్యక్షులు జి శేషుకుమార్, యూత్ సభ్యులు, ఆటో యూనియన్, బొలెరో యూనియన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు.

మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు అప్పలనర్స, కృష్ణారావు తదితరులు

హుకుంపేట: గిరిజన హక్కులు, చట్టాలు అమలుకై పోరాడేందుకు వచ్చే నెల 8, 9 తేదీల్లో అరుకు కేంద్రంగా నిర్వహించే రాష్ట్ర మహాసభలకు ప్రజాసంఘాలు, గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ సభలకు గిరిజనులు అందరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం, గిరిజన సంఘంనేతలు టి.కృష్ణారావు, రామారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గోన్నారు.